‘సీఎం జగన్ చెప్పాడంటే చేయడమే’

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. దగదర్తి మండలం చౌటపుత్తేడులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా పథకాల లబ్ధిపొందిన వారికి బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదరించాలనే లక్ష్యంతో పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలకు సేవలు అందించే ఉద్యోగుల కుటుంబాలను కూడా ఆదరిస్తున్నారన్నారు. జగన్‌ది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని, అందుకే పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేశారని గుర్తు చేశారు. ప్రధానంగా ఉద్యోగులకు భద్రత, భరోసానిచ్చే విధంగా జీపీఎస్ ను అమల్లోకి తీసుకొచ్చారని, ఉద్యోగులు అడక్కుండానే 12వ పీఆర్సీ నియామకం చేశారని ఎమ్మెల్యే చెప్పారు. ఉద్యోగులకు మేలు చేసే ప్రభుత్వం జగన్‌ది అయితే ఉద్యోగుల్ని మోసం చరిత్ర చంద్రబాబుదని తెలిపారు. లోకేష్ సెల్ఫీ దిగలేదని కోడిగుడ్లు వేస్తే ప్రభుత్వానికేంటి సంబంధం అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించి ఇప్పటికే 99 శాతం హామీల్ని మా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. 2014కు ముందు ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తామని జగన్ ఆ నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఈ రోజు సుమారు 10 వేల పైచిలుకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్ చెప్పాడంటే చేస్తాడంతే.. అని మరోమారు నిరూపించుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. గత టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తామని చంద్రబాబు వాగ్దానం చేసి, మంత్రివర్గ కమిటీల పేరుతో కాలయాపన చేసి, ఐదేళ్ల అధికారం ముగిసినా అమలు చేయలేదని గుర్తు చేశారు. సెల్ఫీ దిగలేదని లోకేశ్‌ను టీడీపీ కార్యకర్తలే కోడిగుడ్లతో కొట్టే కార్యకర్తలు వాళ్ల పార్టీలో ఉన్నారంటే ఆ పార్టీ ఎలాంటి పరిస్థితుల్లో ఉందో తేట తెల్లమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, రైతు సాధికార సంస్థ కో–ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన



కావలి: ప్రపంచ రక్తదాతల దినోత్సవాల్లో భాగంగా తుమ్మలపెంట పీహెచ్‌సీలో టీం సేవియర్స్ ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. టీం సేవియర్స్ మహిళా విభాగం సభ్యులు సౌందర్యదీపిక మాట్లాడుతూ తగు జాగ్రత్తలు తీసుకుంటే గర్భిణులు రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. పెళ్లికి ముందే దగ్గరి మేనరిక వివాహాలను అరికడితే, పుట్టబోయే బిడ్డలకు తలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా నివారించవచ్చని వివరించారు. ప్రసవ సమయంలో రక్తం ఎక్కించాల్సిన అవసరం వస్తే తమను సంప్రదిస్తే ఏ గ్రూప్ రక్తమైనా సమకూర్చగలమని భరోసా ఇచ్చారు. డాక్టర్ అనీల్ కుమార్ , టీం సేవియర్స్ నవ్య, రాజేష్, రమణ్ సుందర్, సుతేజ్, రోహిత్ పాల్గొన్నారు.

అట్టల ఫ్యాక్టరీ కాలనీలో..

టీం సేవియర్స్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం రక్తదానంపై అవగాహన కల్పించారు. పట్టణంలోని అట్టల ఫ్యాక్టరీ కాలనీలో టీం సేవియర్స్ మహిళా విభాగం చైర్మన్ కీర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి సాధారణ ఆరోగ్యం, సాటి ప్రాణాన్ని కాపాడాలనే హృదయం ఉంటే చాలన్నారు. రక్తదానానికి పేదరికం అడ్డు కాదని, కావలి పట్టణానికి చెందిన ప్రముఖ రక్తదాతలందరూ పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారేనని ఆమె వివరించారు. కార్యక్రమంలో మేఘన, దీపిక, ప్రేక్ష, సుజిత్, ప్రణయ్, మహేష్, రమణ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


అల్లంపాడు రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు ఆనందరావు

– ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి తెలిపారు. మండలంలోని గండ్లవేడు, నారంపేట గ్రామాల్లో స్థానిక తహసీల్దారు లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నారంపేట సదస్సుకు హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ సాదాబైనామా, చుక్కల భూములు, పోతి కేసులు తదితర అంశాలకు సంబంధించి నిర్దిష్టమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. నారంపేట రెవెన్యూ సదస్సులో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు మాట్లాడుతూ తమ గ్రామంలో గతంలో పేదలకు అందజేసిన సీజేఎఫ్ఎస్, డీకేటీ తదితర భూముల వారసత్వానికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ పృథ్వీకుమార్, వీఆర్ఓలు లక్ష్మీదేవి, కృష్ణయ్య, గండ్లవేడు సర్పంచ్ మాముడూరు నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వినతులపై తక్షణ చర్యలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే వినతులపై వీఆర్ఓల ద్వారా క్షేత్రస్థాయి విచారణ చేయించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఆనందరావు పేర్కొన్నారు. మండలంలోని అల్లంపాడులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

అనుమసముద్రంపేట: రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఏఎస్‌పేట తహసీల్దారు అన్నదాత వెంకటరమణరావు అన్నారు. శుక్రవారం అనుమసముద్రం సచివాలయంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు చుక్కల భూముల సమస్య 300 మందికి పరిష్కారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హాజరత్తమ్మ, వీఆర్ఓ రాఘవులు, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభ

వరికుంటపాడు: మండలంలోని పామూరుపల్లి పంచాయతీ తొడుగుపల్లిలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. తహసీల్దారు అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల గుర్తించి పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. వీఆర్వో కొండయ్య, వైఎస్సార్‌సీపీ మండల బూత్ కన్వీనర్ మానం మస్తానయ్య, నాయకులు బి.రాజేంద్రప్రసాద్, నాగరాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

కాటేపల్లిలో రెవెన్యూ సదస్సులు

వింజమూరు (ఉదయగిరి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు తెలిపారు. మండలంలోని కాటేపల్లి, తమితపాడులో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ సమస్యలు సదస్సులో మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సదస్సులో సర్పంచ్ ఎం.విజయలక్ష్మి, ఆర్ఐ సిరాజ్, వీఆర్వో కర్ర రమణయ్య ఉన్నారు.

ఉనికి కోసం బీజేపీ నేత విమర్శలు

• బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై కావలి ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్ ఫైర్


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్

కావలి : జిల్లాలో బీజేపీకి కొంత విలువ ఉండేది.. భరత్‌కుమార్ యాదవ్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడిని చేశాకా ఆ పార్టీ పూర్తిగా ఉనికి కోల్పోయింది. నీ ఉనికి కోసం ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పై నిరాధార ఆరోపణలు చేస్తూ హీరోను అని అనుకుంటున్న భరత్ జీరో అని అన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చరిత్ర సృష్టించనున్నాడని చెప్పాడు. సొంతూర్లో సర్పంచ్‌ను గెలిపించుకోలేని భరత్‌కుమార్ ఉదయగిరి, ఆత్మకూరులో ప్యాకేజీల కోసం ఎమ్మెల్యేగా పోటీ చేసి డిపాజిట్లు కూడా కోల్పోయిన ఘనత నీదయ్యా అని ఎద్దేవా చేశారు. రాజకీయ సంక్షోభంలో నాలుగు నెలలు ఆపధర్మ మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించిన సమయంలో భరత్‌కుమార్ చేసిన అవినీతి అందరికీ తెలుసన్నారు. ఇంకొకసారి మా ఎమ్మెల్యేపై పిచ్చి పిచ్చిగా మాట్లాడితే తరి మి తరిమి కొడుతామని ప్రసాద్ హెచ్చరించారు. కావలి వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, చైతన్య మాట్లాడారు. సమావేశంలో జనిగర్ల మహేంద్రయాదవ్, కుందుర్తి కామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి , మండలి కృష్ణారావు, పార్టీ వార్డుల ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన జేసీ



దుత్తలూరు: వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కేటాయించిన భూములను జేసీ కూర్మనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్ ఆలయానికి భూమి కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. స్పందించిన ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి కోసం 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. నర్రవాడ సమీపంలోని నేషనల్ హైవే 565 పక్కనే ఉన్న సర్వే నంబరు 21, 22లోని 22 ఎకరాల భూములను జేసీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కరుణాకర్, తహసీల్దార్ సోమ్లానాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయండి



అల్లూరు: మండలంలోని పురిణి పంచాయతీలో జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాని కావలి హౌసింగ్ డీఈ రంవరప్రసాద్ తెలిపారు. శుక్రవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలను చేపట్టి త్వరితంగా పూర్తి చేసే విధంగా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఇంటి నిర్మాణాలను చేపట్టిన వెంటనే బిల్లులు కూడా పడే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ జమీల్, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.33 వేల రికవరీకి సిఫారస్సు


సామాజిక తనిఖీ విచారణ చేపడుతున్న అధికారులు

కలిగిరి: మండలంలో 2022– 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 23 పంచాయతీల్లో రూ.8.32 కోట్లతో చేసిన 720 పనుల్లో రూ.33,155 మేర పనుల్లో తేడాలను గుర్తించిన డ్వామా అధికారులు రికవరీకి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ కార్యక్రమం డ్వామా ప్రిసైడింగ్ ఆఫీసర్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మెట్టుకూరు శిరీష, క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ జేఎస్ రాజు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్, ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, ఏపీఓ శ్రీనివాసరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ ఖర్చులు తగ్గించుకుంటే ఆదాయం


ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం శ్రీనివాసులు

కావలి: ఆర్టీసీలో నిర్వహణ ఖర్చులు తగ్గించడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చునని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో గ్యారేజ్ ఆవరణలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ద్వారా ముఖ్యమంత్రి మన బాధ్యతలను మరింత పెంచారని, రెట్టించిన ఉత్సాహంతో పని చేసి, ప్రజల మన్ననలను పొంది, సంస్థ ప్రతిష్టను కాపాడాలన్నారు. అత్యధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లు బాలకోటయ్య, కోదండయ్యను, అత్యధిక రాబడి తెచ్చిన కండక్టర్లు పీవీఎస్ ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వర్లుకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఫోర్‌మెన్ షేక్ ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి రవిప్రకాష్ పాల్గొన్నారు.

స్వప్రయోజనాలకు పరనింద తగదు


మాట్లాడుతున్న మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

• ఆనం వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): స్వప్రయోజనాల కోసం తరచూ పార్టీలు మారుతూ ఎదుటి వారిపై నిందలు మోపడంలో వెంకటగిరి ఎమ్మెల్యే రామనారాయణరెడ్డి ఆరి తేరారని, సీనియర్ నేతగా ఆయనకు తగదని మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మర్రిపాడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంతో ఉంటే స్వార్థ రాజకీయాలు చేసే ఆనం పేద ప్రజలకు మేలు చేకూరుస్తున్న జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పెద్దన్న పాత్ర పోషించారని, ఆ సమయంలో ఆనం వ్యవహరించిన తీరు ప్రజలకు తెలుసన్నారు. మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న పోరాటంలో కోట్లాది పేదలకు జగనన్న అండగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, దళితులు, బడుగు, బలహీనవర్గాల ఇళ్లకు నేరుగా ఎమ్మెల్యే వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్న చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. 80 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబానికి వారసుడిగా చెప్పుకుంటున్న ఆనం మాట్లాడే మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఏపిలగుంట ఎంపీటీసీ నాయుడు హజరత్‌రెడ్డి, నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవి, బూదవాడ సొసైటీ మాజీ చైర్మన్ చెన్ను శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముటుకుందు లక్ష్మీరెడ్డి, పొంగూరు సుధాకర్, గోపవరం కాంతారెడ్డి, చెవుల శ్రీనివాసులు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, గంగినేని రవీంద్రబాబు, పొంగూరు సుధాకర్, చంద్రా నారాయణ స్వామి, మౌలాలి, నాగేష్, సుబ్బారావు, కొండారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంగళరెడ్డి, తదితరులు మాట్లాడారు.

గృహ లబ్ధిదారులతో కమిషనర్ సమీక్ష


పమిడిపాడు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ బల్లి నాగేశ్వరరావు

ఆత్మకూరు: పట్టణంలోణ/ పమిడిపాడులోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ లబ్ధిదారులతో కమిషనర్ బల్లి నాగేశ్వరరావు శుక్రవారం సమావేశమయ్యారు. నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ సిబ్బంది ద్వారా, గృహ నిర్మాణ సిబ్బంది ద్వారా మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తామన్నారు. పొదుపు మహిళలకు ఇళ్ల నిర్మాణాల కోసం రూ.35వేల బ్యాంకు రుణం మంజూరు చేసేందుకు మెప్మా ద్వారా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నటరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శరత్, సచివాలయాల సిబ్బంది, లబ్ధిదారులైన మహిళలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభం


7వ వార్డులో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని 7, 14 వార్డుల్లో సిమెంట్ రోడ్ల పనులు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పలు వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించిన సందర్భంలో స్థానికులు రోడ్ల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సచివాలయ ప్రత్యేక నిధులతో ఆయా రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. 7వ వార్డు పరిధిలోని తూర్పువీధిలో కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్ బేగం, 14వ వార్డులో కౌన్సిలర్ పి పెంచలయ్య యాదవ్ సిమెంటు రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి చెత్త సేకరణకు తమ సొంత నిధులతో ప్లాస్టిక్ బుట్టలను కార్మికులకు అందజేశారు. గృహ యజమానుల వద్ద నుంచి చెత్తను సేకరించేందుకు అందుబాటులో ప్లాస్టిక్ బుట్టలు లేకపోవడంతో కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం కార్మికులకు ప్లాస్టిక్ బుట్టలను అందజేశారు. ఆయన వెంట 18వ వార్డు కౌన్సిలర్ గంధళ్ల వేణు, విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, రాకేష్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

చేజర్ల (సోమశిల): ఆటోను కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన అనంతసాగరం మండలం ఉప్పలపాడు హైవేపై శుక్రవారం జరిగింది. సోమశిల ఎస్సై బోజ్యానాయక్ క్షతగాత్రులను 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మంచాలపల్లికి చెందిన కూలీలు బొమ్మవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.